క్లుప్తంగా

కోటమైసమ్మ దుకాణాల వేలం వాయిదా

కామేపల్లి: కొత్తలింగాల శ్రీ కోటమైసమ్మతల్లి దేవాలయానికి సంబంధించిన వివిధ దుకాణాల నిర్వహణకు శనివారం దేవాదాయ శాఖ ఖమ్మం విభాగం పరిశీలకురాలు ఆర్.సమత ఆధ్వర్యాన కోటమైసమ్మ దేవాలయంలో బహిరంగ వేలం నిర్వహించారు. కాగా, ఈ వేలానికి ఎవరూ రాకపోవడంతో వాయిదా వేసినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహణాధికారి నల్లమోతు శేషయ్య, జూనియర్ అసిస్టెంట్ వరప్రసాద్, అర్చకులు పుల్లయ్యశర్మ తదితరులు పాల్గొన్నారు.

'అభ్యాసన'లో గ్రాండ్ పేరెంట్స్ డే

ఖమ్మం సహకారనగర్: నగరంలోని అభ్యాసన సీబీఎస్ఈ పాఠశాలలో శనివారం గ్రాండ్ పేరెంట్స్ డేను ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల డైరెక్టర్ ఆర్వీ నాగేంద్రకుమార్, గొల్లపుడి రాంప్రసాద్, ఎం.చైతన్యకృష్ణలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు తాత, అమ్మమ్మ, నాయనమ్మల గొప్పతనం తెలియచేసేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా పలు పోటీలు నిర్వహించడంతో పాటు గ్రాండ్ పేరంట్స్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగప్రవీణ, ఏజీఎం వేముల విజయ్, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

రఘునాథపాలెం: మండలంలోని బూడిదంపాడుకు చెందిన కొత్తపల్లి శేషమ్మ ఇటీవల కేన్సర్‌తో మృతి చెందింది. ఈనేపథ్యాన శేషమ్మ కుటుంబానికి అండగా నిలవాలని గ్రామ కాంగ్రెస్ హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు రూ.10వేల ఆర్థిక సాయమందించారు.

నేత్రదానం..

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లాలో వివిధ ప్రాంతాలకు చెందిన పొట్టిమూతి కస్తూరి, పగడాల రామ్మూర్తి, మేకల శ్రీనివాస్, బండారు సీతమ్మ, సీలం వెంకటేశ్వరరెడ్డి, మాణిక్యాల వెంకటరమనయ్య, కర్లపాటి జగదీశ్వర్, చేకూరి సుధాకర్, కొల్లు ప్రసాదరావు, జంగిలి రామ్మూర్తి, బొందిలి రాధాబాయ్ మృతి చెందగా వారి నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. సేకరించిన నేత్రాలను హైదరాబాద్ ఎల్.వీ.ప్రసాద్, అగర్వాల్, వాసన్ ఐబ్యాంక్‌లకు పంపినట్లు ఖమ్మం నేత్రనిధి కార్యదర్శి ఆర్.అనంత పద్మనాభం ఒక ప్రకటనలో తెలిపారు.

కులపీడనకు వ్యతిరేకంగా పోరాడుదాం

ఖమ్మం మామిళ్లగూడెం: మహాత్మా జ్యోతిరావు పూలే స్థాపించిన సత్య శోధక్ సమాజ్ ఆశయాల వెలుగులో కుల పీడన అణిచివేతకు వ్యతిరేకంగా పోరాడాలని సీపీఎం ఎంఎల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి గోకినపల్లి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. సంస్థ స్థాపించి 150 ఏళ్లు పూర్తయినందున శనివారం ఖమ్మం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆవుల అశోక్, టి.ఝాన్సీ, శిరోమణి, శ్రీనివాస్, ఆజాద్, చందు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

కూసుమంచి/తిరుమలాయపాలెం: పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు మరోసారి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం కూసుమంచి, తిరుమలాయపలెం మండలాలకు చెందిన పలువురి లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కూసుమంచి మండలానికి చెందిన 32 మందికి క్యాంపు కార్యాలయంలో, తిరుమలాయపాలెం మండలానికి చెందిన 69 మంది లబ్ధిదారులకు ఎంపీడీఓ కార్యాలయంలో చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్లు సంపత్‌కుమార్, రామ్‌ప్రసాద్, ఎంపీడీఓ చుంచు శ్రీనివాసరావు, ఎంపీపీ మంగీలాల్, డిప్యూటీ తహసీల్దార్ నర్సింహారావు, డీసీసీబీ డైరెక్టర్ చావా వేణు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక..

ఖమ్మంరూరల్/నేలకొండపల్లి: మండలంలోని తీర్థాలలో గల సంగమేశ్వరస్వామి ఆలయ చైర్మన్‌గా భూక్యా రామానాయక్ శనివారం ఎన్నికయ్యారు. ఈమేరకు చైర్మన్‌తో పాటు పాలకమండలి ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి సమక్షంలో ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం దారేడులో పలు పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అలాగే నేలకొండపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ రాయపూడి నవీన్ కూసుమంచి క్యాంపు కార్యాలయంలో, మంగాపురానికి చెందిన డి.నాగేశ్వరరావు బీఆర్ఎస్‌లో చేరారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ బెల్లం ఉమా, జెడ్పీటీసీ ఎ.వరప్రసాద్, లక్ష్మణ్‌నాయక్, మల్లయ్య, రామయ్య తదితరులు పాల్గొన్నారు.


కూసుమంచి: చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

రైతుల శ్రేయస్సే ప్రధాన అజెండా


మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్ చిదంబరరావు

కామేపల్లి: రైతుల శ్రేయస్సే ప్రధాన అజెండా అని, అందరి సహకారంతో సహకార సంఘాన్ని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తామని కామేపల్లి సొసైటీ చైర్మన్ తీర్థాల చిదంబరరావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సొసైటీ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువులు, రుణాలు అందించి సంఘం అండగా నిలుస్తుందన్నారు. రైతులు సకాలంలో పంట రుణాలను రెన్యూవల్ చేసుకోవాలని, రుణమాఫీ డబ్బులు త్వరలోనే రైతుల ఖాతాల్లో జమ అవుతాయని తెలిపారు. అనంతరం గత ఆరు నెలల వ్యవధిలో కొనసాగిన లావాదేవీలు, వ్యాపార ఖాతా నిర్వహణలకు సంబంధించిన అంశాలను రైతులకు చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షుడు కాట్రాల రోశయ్య, డైరెక్టర్లు తుమ్మలపల్లి వీరయ్య, భట్టు పెంట్యా, భూక్యా జైత్రాం, సొసైటీ సెక్రటరీ గాదె నాగయ్య, రైతులు పాల్గొన్నారు.

కొత్త రుణాలు ఇవ్వాలి

తిరుమలాయపాలెం: రాష్ట్ర ప్రభుత్వం హామీ మేరకు రైతుల రుణాలను మాఫీ చేసి కొత్త రుణాలు ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని హస్నాబాద్ గ్రామంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భక్తరామదాసు ప్రాజెక్టు ద్వారా అన్ని చెరువులు నింపాలని, సొసైటీలలో రాజకీయ జోక్యాన్ని నివారించి రైతులందరికీ రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు నర్సయ్య, ఇంద్రసేన్, తుల్లూరి నాగేశ్వరరావు, ఉపేందర్, సనాతనాచారి, శ్రీను, పల్లి నాగేశ్వరరావు, పురం మల్లయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతో కాంగ్రెస్‌ను గెలిపించాలి

ఖమ్మంరూరల్: పాలేరు నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఐక్యతతో కాంగ్రెస్‌ను గెలిపించుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు తుంబూరు దయాకర్‌రెడ్డి, సాధు రమేష్‌రెడ్డిలు అన్నారు. శనివారం మండలంలోని రెడ్డిపల్లిగ్రామంలో గల ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన ఆత్మీయ సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ ఇచ్చిన గ్యారంటీ కార్డులతో ఇంటింటికి వెళ్లి విస్తృతంగా ప్రచారం చేయాలని పార్టీ కార్యకర్తలకు సూచించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కళ్లెం వెంకటరెడ్డి, నాయకులు మద్ది వీరారెడ్డి, బోజెడ్ల వెంకటయ్య, కన్నేటి వెంకన్న, తేజావత్ పంతులునాయక్, జంగం భాస్కర్, తోట వీరభద్రం, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన వర్కర్ల వినూత్న నిరసన


చెవిలో పూలు పెట్టుకొని వర్కర్ల నిరసన

తిరుమలాయపాలెం: మధ్యాహ్న భోజన కార్మికులకు పెంచిన రూ.2వేలు ఇవ్వకుండా చెవిలో పువ్వులు పెట్టారని సీఐటీయూ ఆధ్వర్యాన కార్మికులు వినూత్నంగా చెవిలో పూలు పెట్టుకొని శనివారం తమ నిరసనను తెలియజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు వీరన్న మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా వెట్టి చాకిరీ చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులను ప్రభుత్వం నేటి వరకూ గుర్తించకపోవడం దారుణమని పేర్కొన్నారు. ఐదు నెలలుగా పెండింగ్ వేతనాలు, మెను చార్జీలు తక్షణమే చెల్లించి వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మెను విరమించేదే లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికుల మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.పద్మ, గొడుగు ముత్తమ్మ, చుంచు ఉపేంద్ర, ఉప్పమ్మ, పెరుమాళ్ళపల్లి మంగమ్మ, సరోజన, మంగమ్మ వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు పొంగులేటి పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: తెలంగాణ కాంగ్రెస్ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం పాలేరు నియోజకవర్గంలో పర్యటించనున్నట్లు క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కూసుమంచి మండలంలోని నాయకన్‌గూడెం, మందడి నర్సయ్యగూడెం, జక్కేపల్లి, గోరిలాపాడుతండా, జుజ్జులరావు పేట, పాలేరు, ఎర్రగడ్డ తండా, క్రిష్టాపురం, చేగొమ్మ గ్రామాలను, ఖమ్మం రూరల్ మండలంలోని కామంచికల్, జానాబాద్ తండా, మద్దివారి గూడెం తదితర గ్రామాలను సందర్శించి పలు బాధిత కుటుంబాలను పరామర్శించి ఓదారుస్తారని తెలిపారు.

నేడు కరెంట్ కట్

ఖమ్మంఅర్బన్: నగరంలోని వీవీపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో లేన్ల మరమ్మతుల దృష్ట్యా ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఖమ్మం అర్బన్ విద్యుత్ ఏఈ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సబ్ స్టేషన్ పరిధిలోని నూతన కలెక్టరేట్, జీఆర్ఆర్ శ్రీనివాస్ సముదాయం, రఘునాథపాలెం మండలం గణేశ్వరం, చింతగుర్తి, వేపకుంట్ల, చెరువుకొమ్ముతండా తదితర గ్రామాల్లో అంతరాయం ఉంటుందన్నారు.

విస్తృత ప్రచారం చేయండి

నేలకొండపల్లి/ఖమ్మంరూరల్/రఘునాథపాలెం: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం ప్రతీ కార్యకర్త శక్తి వంచన లేకుండా విస్తృతంగా ప్రచారం చేయాలని మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. శనివారం నేలకొండపల్లి, ఖమ్మంరూరల్, రఘునాథపాలెం మండలాలకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు ఆయన్ను కలిసిన సందర్భంగా మాట్లాడారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి కాంగ్రెస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. మైశా శంకర్, కడియాల శ్రీనివాసరావు, ముత్తినేని వీరయ్య, కొత్తా సత్యనారాయణ, వేగినాటి లక్ష్మీనర్సయ్య, కడియాల నరేష్, యడవల్లి సైదులు, కొమ్మూరి నరేష్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పర్ణశాలల పండుగ

ఖమ్మంగాంధీచౌక్: లోక రక్షకుడు యాషువ మెస్సీయ జన్మదినాన్ని పర్ణశాలల పండుగగా జరుపుకున్నారు. శనివారం నగరంలోని రమణగుట్టలో జరిగిన పర్ణశాలల పండుగలో యావె సమాజ ప్రార్థనా మందిర పాస్టర్ పాలడుగు రత్నపాల్ పాల్గొని పండుగ ప్రాధ్యానతను వివరించారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వృద్ధులు, అనాథలు, వితంతువులకు చీరలు, దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బొజ్జ వివేక్, బాసింగు ప్రసాద్, మోదుగు మోసె, వడ్లమూడి ప్రసాద్, పాలు, కొరకొప్పుల డేవిడ్, అంబోజి జీవరత్నం, మునగాల మనోహర్, కుక్కల సామేలు, తదితరులు పాల్గొన్నారు.

మండలానికి చేరిన బతుకమ్మ చీరలు

కామేపల్లి: బతుకమ్మ పండుగ సందర్భంగా తెలంగాణ ఆడబిడ్డలకు అందించనున్న చీరలు మండల కేంద్రానికి శనివారం చేరుకున్నాయి. మొత్తం 11,847 చీరలు వచ్చాయని త్వరలోనే గ్రామాల వారీగా మహిళలకు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ లక్ష్మి తెలిపారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఖమ్మం సహకారనగర్: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని మంత్రి కేటీఆర్‌ను టీఎన్జీవోస్ బాధ్యులు కోరారు. జిల్లాకు శనివారం వచ్చిన మంత్రిని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు, ఉద్యోగ జేఏసీ చైర్మన్ షేక్ అఫ్జల్‌హసన్ ఆధ్వర్యాన ఉద్యోగులు కలిశారు. ఈ సందర్భంగా అఫ్జల్ హసన్ మాట్లాడుతూ సీపీఎస్ రద్దు, పీఆర్సీ, డీఏ బకాయిల చెల్లింపు, పెండింగ్ బిల్లుల విడుదల, వీఆర్వోలు, వీఆర్ఏల సమస్యల విన్నవించడంతో ప్రతినెల 1వ తేదీన వేతనాలు అందేలా చూడాలని కోరారు. టీఎన్జీవోస్ రాష్ట్ర కార్యదర్శి జీ.ఎస్.ప్రసాద్ రావు, జిల్లా కార్యదర్శి ఆర్వీఎస్.సాగర్‌తో పాటు సుంచు వీరనారాయణ, నాగుల్‌మీరా, శాబాసు జ్యోతి, వెంకట్‌రెడ్డి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రాలు అందజేత..

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మంలో పర్యటించిన మంత్రి కేటీఆర్‌కు పలు ఉద్యోగ సంఘాలు, ప్రజా సంఘాల నేతలు వినతిపత్రాలు అందజేశారు. కేఎంసీ కార్యాలయం వద్ద కేజీబీవీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కేజీబీవీ ఉద్యోగుల సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమశాఖల నాలుగో తరగతి అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు తమ సమ్యలను పరిష్కరించాలని, తమకు డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చారు. ఇక ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యాన అంగన్‌వాడీ ఉద్యోగులు మంత్రి కేటీఆర్ తిరుగు ప్రయాణంలో మమత మైదానంలో హెలిప్యాడ్ వద్ద కేటీఆర్‌ను కలిసి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం, కేఎంసీ కార్మికులు సమస్యలపై మంత్రికి వినతిపత్రం అందజేశారు.


కేటీఆర్‌ను సన్మానిస్తున్న టీఎన్జీవోస్ బాధ్యులు

కేటీఆర్‌ను కలిసిన హరికృష్ణ, సాయికృష్ణ..

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు గొల్లపూడి హరికృష్ణ, ఎన్టీఆర్ అభిమాన సంఘం నాయకుడు మోరంపూడి సాయికృష్ణలు శనివారం కేటీఆర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.


మంత్రి కేటీఆర్‌తో హరికృష్ణ, సాయి కృష్ణ, పక్కన మంత్రి పువ్వాడ

'నేతల జోక్యంతో నీరుగారుతున్న పథకాలు'

నేలకొండపల్లి: దళితబంధులో రాజకీయ జోక్యాన్ని నివారించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బండి రమేశ్ డిమాండ్ చేశారు. స్థానిక రావెళ్ల భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పథకాలలో అధికార పార్టీ నాయకుల జోక్యంతో పథకం నీరుగారుతుందని అన్నారు. రుణమాఫీ పథకాన్ని రైతులందరికీ, అర్హులందరికీ గృహలక్ష్మి పథకాన్ని వర్తింపజేయాలని, పాలేరు పాత కాల్వకు నీటి సరఫరాను నిరంతరం అందించాలని కోరారు. అలాగే అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ రచ్చా నరసింహారావు, గుడవర్తి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కే.వీ.రెడ్డి, బెల్లం లక్ష్మి, సిరికొండ ఉమామహేశ్వరీ, మారుతి కొండలరావు, మందడపు మురళీకృష్ణ, శీలం అప్పారావు, పెద్దిరాజు నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బండి రమేశ్


అటెన్షన్ ప్లీజ్

నిలుస్తున్న నీళ్లతో అవస్థలు..!



ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి వెనుక భాగంలో ఉన్న ఆయుర్వేదిక్, యునాని వైద్యశాలకు నిత్యం బాధితులు వైద్య సేవల కోసం వస్తుంటారు. ఈ నేపథ్యాన వైద్య కళాశాలలో చదువుతున్న బాయ్స్ కోసం పాత డీఎంహెచ్‌ఓ కార్యాలయానికి పక్కన నూతనంగా సీసీ రోడ్డు వేశారు. కానీ మట్టి పోయటం మరిచారు. ఫలితంగా ఏ చిన్నపాటి వర్షం పడినా గుంతమయంగా ఉండడంతో ఇదిగో ఇలా నీళ్లు నిలిచిపోయి బురదమయంగా మారుతోంది. దీంతో ఆస్పత్రికి వచ్చి వెళ్లే రోగులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే మట్టిపోసి చదును చేయాలని పలువురు కోరుతున్నారు.

– ఖమ్మంవైద్యవిభాగం

చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ


విగ్రహావిష్కరణలో పాల్గొన్న నాయకులు

తిరుమలాయపాలెం: మండలంలోని కాకరవాయి గ్రామంలో ఐలమ్మ యూత్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ స్మారక విగ్రహాన్ని శనివారం చిట్యాల రామచంద్రయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో నేషనల్ దోబీ రిజర్వేషన్ సంఘ జాతీయ కన్వీనర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఊరూరా చాకలి ఐలమ్మ విగ్రహాలను ఏర్పాటు చేయాలని, రజకులను ఎస్సీ జాబితాలో చేర్చడంతో పాటు రాజకీయంలో రజకులకు 5 అసెంబ్లీ స్థానాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు డాక్టర్ కొత్తపల్లి రాములు, సంజీవ్‌రాజ్, పోసెట్టి, వెంకటరమణ, శ్రీనివాస్, నాగలింగం పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన అవసరం

రఘునాథపాలెం: మండలంలోని చెర్వుకొమ్ముతండా గ్రామపంచాయతీ కార్యాలయంలో శనివారం సోషల్ వెల్ఫేర్ వారి ఆధ్వర్యాన పౌర హక్కులపై యువతకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బానోత్ మంగమ్మ దేవేందర్ మాట్లాడుతూ.. ప్రతి పౌరుడు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సదస్సులో సోషల్ వెల్ఫేర్ అధికారులు, ఎంపీడీఓ రామకృష్ణ, ఎమ్మార్వో విల్సన్, ఆర్ఐ, పోలీస్ శాఖ, వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

ఫ్రెషర్స్ డే వేడుకలు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ విద్యార్థులు, ప్రథమ సంవత్సర విద్యార్థినులకు స్వాగతం పలుకగా.. కళాశాల ప్రిన్సిపాల్ జి.పద్మావతి మాట్లాడారు. కళాశాలలో ఉన్న మౌలిక వసతులను ఉపయోగించుకుని విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. అనంతరం విద్యార్థుల ప్రదర్శలను అందరినీ ఆకట్టుకున్నాయి.

మిర్చి తోటల పరిశీలన

కూసుమంచి: మండలంలోని చేగొమ్మ గ్రామంలో మిర్చి తోటలను శనివారం ఏఓ వాణి పరిశీలించారు. రైతులతో మాట్లాడి సాగు పద్ధతులు, సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం మిరప తోటలకు సోకిన వైరస్ నివారణకు పలు సూచనలు, సలహాలు అందించారు. ముఖ్యంగా మిరపలో తెల్లదోమ వలన కలిగే వైరస్‌ల నివారణకు లీటరు నీటికి 300 గ్రాముల ఎసిఫేట్ లేదా తయోమిథాక్సం మందును ఒక లీటరు వేపనూనెలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ కిరణ్మయి, రైతులు పాల్గొన్నారు.

